క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే వైవీఆర్



కలెక్టర్ నాగలక్ష్మికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లుటౌన్: విజయనగరం జిల్లా కలెక్టర్‌గా బదిలీపై వెళ్లనున్న నాగలక్ష్మిని గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్‌ను కలిసిన ఆయన గుంతకల్లు నియోజకవర్గం అభివృద్ధికి సహకారమందించినందుకు గానూ ఆమెకు కృతజ్ఞతలు తెలియజేశారు.

నేడు 'రన్ ఫర్ జీసస్'

గుత్తి: పట్టణంలో శనివారం ఉదయం 6 గంటలకు రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు గుత్తి క్రైస్తవ సంఘాల కో-ఆర్డినేటర్ వైపీ బాబు చెప్పారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గుత్తి ఆర్ఎస్‌లోని సీఎస్ఐ చర్చి వద్ద నుంచి గుత్తి టౌన్ సీఎస్ఐ చర్చి వరకు కార్యక్రమం సాగుతుందని తెలిపారు. క్రైస్తవ సోదరులందరూ తప్పకుండా ఈ కార్యక్రమం పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్ఐ గురు ప్రసాద్‌రెడ్డి

యాడికి: వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో చెన్నకేశవ స్వామి ఆలయం ఎదురుగా మండలంలోని వడ్డెర కులస్తులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎస్ఐ ప్రారంభించారు. కార్యక్రమంలో వడ్డెర కులస్తులు శంకర్, రాజశేఖర్, రామాంజనేయులు, జనార్దన, నాగార్జున, వెంకటరాముడు, నాగేంద్ర, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

యువకుడికి తీవ్ర గాయాలు

పెద్దవడుగూరు : మల్లేనిపల్లి గ్రామానికి చెందిన గంగాధర్ అనే యువకుడు బైక్ టైరు పేలడంతో కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. గంగాధర్ శనివారం ఉదయం మల్లేనిపల్లి నుంచి పెద్దవడుగూరుకి మెకానిక్ షాపు ఓపెన్ చేసుకోవడానికి బయలుదేరాడు. లక్ష్మంపల్లి సమీపంలో బండి టైర్ పేలిపోయింది. దీంతో బైకుపై నుంచి కిందపడి తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు క్షతగాత్రున్ని పెద్దవడుగూరులోని ప్రయివేటు క్లినిక్‌కు తరలించారు.

బాధితుడికి ఆర్థికసాయం



మహబూబ్ పీరాకు నగదు అందిస్తున్న బొంబాయి రమేష్‌నాయుడు

యాడికి: మూత్రాశయ క్యాన్సర్‌తో బాధ పడుతున్న వ్యక్తికి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్‌నాయుడు అండగా నిలిచారు. మండల కేంద్రంలో కొండకింద నివసిస్తున్న మహబూబ్ పీరా కొంత కాలంగా మూత్రాశయం క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. అతడి ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న బొంబాయి రమేష్‌నాయుడు శుక్రవారం అతడి ఇంటికి వెళ్లి రూ.10 వేలు ఆర్థికసాయం చేశారు. ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, ఎంపీటీసీలు వెంకటనాయుడు, నాగరాజు, వార్డు సభ్యులు తిరుపతి, రామచంద్ర, నాయకులు చౌదరి, వెంకటనాయుడు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని చేపల మార్కెట్ సమీపంలో పేకాటాడుతున్న ఏడుగురిని శుక్రవారం అరెస్ట్ చేసినట్లు సీఐ ఆనందరావు తెలిపారు. వారి నుంచి రూ.16,700 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

ఓటీ సేవలందించాలి

గుంతకల్లుటౌన్: గుంతకల్లు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ప్రజలకు ఓటీ సేవలు అందించడంతో పాటు అన్నిరకాల జబ్బులకు వైద్యమందించే నిపుణులను నియమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికై సీపీఎం నాయకులు మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారానికి మూడోరోజుకు చేరుకున్నాయి. ఆయన దీక్షాపరులకు సంఘీభావం తెలిపి మాట్లాడారు. సీపీఎం పట్టణ కార్యదర్శి భజంత్రీ శ్రీనివాసులు, నాయకులు డి.శ్రీనివాసులు, మారుతి, దాసరి శ్రీనివాసులు, జగ్గిలి రమేష్, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

మే డే జయప్రదం చేయండి

గుంతకల్లు రూరల్: మే డేను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బీ.గోవిందు పట్టణంలోని ఏఐటీయూసీ కార్మికులను కోరారు. శుక్రవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్మిక హక్కులు, చట్టాల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

జగనన్నతోనే ఏపీకి బంగారు భవిష్యత్తు





మా నమ్మకం నువ్వే జగన్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, ప్రభుత్వం అందించిన లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, ప్రభుత్వ పనితీరును తెలియజేస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

• గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుంతకల్లుటౌన్: దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా నవరత్నాల్లాంటి సంక్షేమ పథకాల ద్వారా పేదప్రజల ఖాతాల్లోకి రూ.2 లక్షల కోట్లను జమచేసి వారి జీవితాల్లో వెలుగులు నింపిన జగనన్నే తమ భవిష్యత్తు అని సాక్ష్యాత్తు ప్రజలే గర్వంగా నినదిస్తున్నారని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి తెలిపారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్లను ఆయన విడుదల చేశారు. అనంతరం ఎమ్మెల్యే ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి 24వ వార్డులో ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పనితీరుపై ప్రజలు ఎలా సంతృప్తి చెందారనే విషయమై ఆరా తీశారు. ప్రభుత్వం నుంచి ఇంకా ఏవైనా పథకాలు అందాలా అని అడిగి తెలుసుకున్నారు. పార్టీ పంపిన ప్రజా మద్దతు పుస్తకంలో ఐదు ప్రశ్నలకు వివరాలు రాబట్టారు. ప్రజాభీష్టం మేరకే వారి ఇంటి గోడలకు మా నమ్మకం నువ్వే జగనన్న స్టిక్కర్లను అతికించారు. జగనన్న ప్రభుత్వం ద్వారా మీకు మేలు జరిగే ఉంటే మరోసారి జగనన్నకు ఆశీర్వాదాలు అందించాలని ఎమ్మెల్యే కోరారు. అనంతరం ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ బీసీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.రామలింగప్ప మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు బాగులేకున్నా ఎన్నికల మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించి నాలుగేళ్లలోనే 98 శాతం హామీలను అమలు చేశామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు మహిళలకు అన్ని రంగాల్లో సమాన ప్రాధాన్యత కల్పించి వారిని అన్ని విధాలుగా అభివృద్ధి పరిచిన ఘనత జగనన్నదేనన్నారు. ప్రజారంజక పాలన సాగిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డికి చల్లని దీవెలనందించాలని వారు కోరారు. మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్‌లు నైరుతిరెడ్డి, మైమూన్, ఎంపీపీ మాధవి, జెడ్పీటీసీ కదిరప్ప, వార్డు సచివాలయాల పట్టణ, మండల కన్వీనర్లు జింకల రామాంజినేయులు, ఎండీఆర్.ఖలీల్, గోవింద్‌నాయక్, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు సుంకప్ప, మోహన్, మాజీ కన్వీనర్ శంకర్, వీరశైవలింగాయత్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ యుగంధర్‌రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు సుంకిరెడ్డి, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచులు, కోఆప్షన్‌సభ్యులు, వార్డు సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుంతకల్లు రూరల్: రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా అహర్నిశలూ కృషి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి ప్రజలు అండగా ఉండాలని సచివాలయ కన్వీనర్లు, సర్పంచులు , ఎంపీటీసీలు ప్రజలకు విన్నవించారు. శుక్రవారం దోసలుడుకి, మొలకలపెంట, గుండాల తండా, నక్కనదొడ్డి సచివాలయాల పరిధిలోని ఉన్న గ్రామాల్లో వారు జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని చేపట్టారు. సచివాలయ మండల కన్వీనర్ గోవిందు నాయక్, మొలకలపెంట సర్పంచ్ మురహరినాయుడు, ఎంపీటీసీ నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

యాడికి: చిక్కేపల్లె , రాయలచెరువు గ్రామాల్లో శుక్రవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరామి రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ శివప్రసాద్ ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో చిక్కేపల్లె, నగరూరు, సర్పంచులు నాగలక్ష్మి, రుక్మాందరెడ్డి, నాగేష్, రషీద్, గ్రామ సచివాలయ కన్వీనర్ ఉమామహేశ్వరి, గృహసారథులు రమాదేవి, చిన్న కుళ్లాయప్ప, నాయకులు అశోక్ రెడ్డి, దిలీప్ పాల్గొన్నారు.

నారా లోకేష్‌కు రాజకీయ పరిజ్ఞానం లేదు

టీడీపీ అధినేత చంద్రబాబు తనయుడు నారాలోకేష్ యువగళం పేరుతో నిర్వహిస్తున్న పాదయాత్రలో సీఎం జగన్‌తో పాటు స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలపై వ్యక్తిగత దూషణలకు పాల్పడుతున్న లోకేష్‌కు ప్రజలే బుద్ధిచెబుతారని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామలింగప్ప పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వచ్చిన సీట్లను చూసి టీడీపీ నేతలు రెచ్చిపోతున్నారన్నారని వారు విమర్శించారు. లోకేష్ కనీస రాజకీయ పరిజ్ఞానం లేని అజ్ఞాని అని వారు ఎద్దేవా చేశారు. టీడీపీ వస్తే ఏం చేస్తామో చెప్పకుండా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ కక్షలు, కార్పణ్యాలకు ఆజ్యం పోయడం తగదన్నారు. టీడీపీ వస్తే సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థను రద్దుచేస్తామని, నవరత్నాలను తొలగిస్తామని టీడీపీ నేతలు బాహాటంగా చెబుతున్నారని, ప్రజలు జాగ్రత్తగా ఉండి టీడీపీ నేతలకు గట్టిగా బుద్ధిచెప్పాలని వారు విజ్ఞప్తి చేశారు.

అన్ని వర్గాల ప్రజలకు పెద్దపీట

• ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి: అభివృద్ధి, సంక్షేమం విషయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రజలకు వివరించారు. శుక్రవారం ఆయన పట్టణంలోని 30వ వార్డు, భగత్‌సింగ్ నగర్‌లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లతో కలసి ఆయన వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి టీడీపీ ప్రభుత్వం, ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పాలన, ఇతర అంశాల పరంగా ఉన్న తేడాను ప్రజలకు వివరించారు. ప్రస్తుతం చేపడుతున్న కార్యక్రమం ముఖ్య ఉద్దేశం గత నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి చేకూరిన మేలు తెలియజేశారు. భవిష్యత్తులో ఇవి ఇలానే కొనసాగాలని కోరుకుంటున్నారా అని అడిగారు. అందుకు పలువురు సుముఖత వ్యక్తం చేశారు. సుముఖతగా ఉన్న వ్యక్తులు ప్రజా మద్దతు పుస్తకంలో ఉన్న 5 ప్రశ్నలకు జవాబులివ్వాలని కోరారు. దీంతో అక్కడి గృహసారథులు, కన్వీనర్లు, వలంటీర్లు వారు అడిగిన ప్రశ్నలకు సమాధానాలను ప్రజా నమోదు పుస్తకంలో రాసుకుని, వారికి రసీదును అందజేశారు. ప్రభుత్వం పట్ల మద్దతు తెలుపుతూ ఉన్న వ్యక్తులు ముఖ్యమంత్రికి 8296082960 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇచ్చి, కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రభుత్వానికి మద్దతు తెలిపిన వారి కుటుంబాల ఇంటి తలుపులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోతో ఉన్న స్టిక్కర్‌ను అంటించారు. ఇలా మొదటి రోజు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ప్రారంభించగా, కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు కార్యక్రమాన్ని దిగ్విజయంగా ముందుకు తీసుకుపోయారు. కార్యక్రమంలో వార్డు కన్వీనర్ డిష్ సూరి, కాశీ మనోజ్, కుమార్, వాల్మీకీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సజ్జలదిన్నె రాజు, నాయకులు కంచం రామ్మోహన్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ బాబు పేరం ప్రతాపరెడ్డి, బాబా తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరు: గొడ్డుమర్రి గ్రామంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అందించిన లబ్ధిని తెలియజేయడంతోపాటు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మరోసారి జగనన్నను సీఎం చేసుకుందామని ప్రజలను కోరారు. గృహసారథి బాబయ్య, వలంటీర్ పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పథకాలే వైఎస్సార్‌సీపీని గెలిపిస్తాయి

• ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

బుక్కరాయసముద్రం: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తాయని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. శుక్రవారం పొడరాళ్ల గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా..ప్రభుత్వంపై సంతృప్తిగా ఉన్నారా అని నేరుగా ప్రజలతో మాట్లాడారు. గత ప్రభుత్వం ఈ ప్రభుత్వానికి తేడాలను వివరిస్తూ ప్రజల అభిప్రాయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఇంటికీ ఏదో ఒక సంక్షేమ పథకం అందిస్తోందన్నారు. సంక్షేమం, అభివృద్ధి గురించి తెలుసుకునేందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. ఈ నెల 14వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువ నేత ఆలూరి ఎర్రిస్వామి రెడ్డి, ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ భాస్కర్, ఆలూరు రమణారెడ్డి, వైస్ ఎంపీపీ రామగోపాల్, సర్పంచ్‌లు పార్వతి, ఎర్రిస్వామి, శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ అంకే నరేష్, గువ్వల రాజశేఖర్‌రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ బయపరెడ్డి, కొత్తపల్లి నాగలింగారెడ్డి, అప్పిరెడ్డి, వెంకటరామిరెడ్డి, బలపనూరు అశోక్‌కుమార్, చికెన్ నారాయణస్వామి, బుల్లే నారాయణ స్వామి, ముసలన్న, కొండమ్మ, అనంత వెంకటరెడ్డి, పురుషోత్తం, కొండన్న, సాకే లక్ష్మి నారాయణ, ఉప సర్పంచ్ ఆదినారాయణ ప్రసాద్, లింగమయ్య, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు: మండలవ్యాప్తంగా శుక్రవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ప్రారంభమైయ్యింది. ఈ సందర్భంగా గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వివరించడంతో పాటు ప్రజల అభిప్రాయాలను నమోదు చేసుకున్నారు. అలాగే గత ప్రభుత్వానికి, జగనన్న పాలనకు గల వ్యత్యాసాలను వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నాగేశ్వరరావు, న్యాయవాది భాస్కర్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్లు క్రిష్ణవేణి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'జగనన్నే మా భవిష్యత్తు'ను జయప్రదం చేయండి

శింగనమల: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్నే మా భవిష్యత్ కార్యాక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రభుత్వ విద్య సలహాదారులు ఆలూరు సాంబశివారెడ్డి కోరారు. మండలంలోని కల్లుమడి, తరిమెల, ఉల్లికల్లు గ్రామ సచివాలయాల్లో సచివాలయ కన్వీనర్లు, కో-కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం పనితీరులో తేడాను తెలియజేయాలన్నారు. ఈనెల 20 వరకూ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి, ఎంపీపీ యోగేశ్వరి, సర్పంచ్ పక్కీరమ్మ, ఎంపీటీసీ నల్లప్ప, రమేష్, ఓబిలేసు, పరంధామరెడ్డి, మండల కన్వీనర్ నగేష్, చెన్నకేశవులు, గాండ్ల కార్పొరేషన్ డైరెక్టర్ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.



కల్లుమడిలో మాట్లాడుతున్న ఆలూరు సాంబశివారెడ్డి

నయనానందకరం.. కోదండరాముడి కల్యాణం



కల్యాణ క్రతువును నిర్వహిస్తున్న అర్చకులు


తాడిపత్రి అర్బన్: పట్టణంలోని ఏడిగడ్డ ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రీరామనవమి నవరాత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం కోదండరాముని కల్యాణం నయనానందకరంగా సాగింది. ఉదయం 11 గంటలకు ఎదుర్కోలు ఉత్సవాన్ని సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. సీతారాముల ఉత్సవ విగ్రహాలు నూతన వస్త్రాలతో ఉభయందార్లు బహుకరించిన యజ్ఞోపవీతం, ఆభరణాలు, పుష్పాలతో అలంకరించిన పల్లకిలో ప్రధాన ఆలయం నుంచి మంగళవాయిద్యాలతో కల్యాణ వేదిక వరకు భక్తుల జయజయధ్వానాల మధ్య ఊరేగింపుగా తీసుకొచ్చారు. వధూవరులైన సీతారాముల విగ్రహాలను ఎదురెదురుగా కూర్చోబెట్టి శాస్త్రోక్తంగా సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. ప్రధాన అర్చకుల పర్యవేక్షణలో 12 గంటలకు సీతారాములకు శిరస్సుపై జీలకర్ర, బెల్లం ఉంచారు. మధ్యాహ్నం 1గంటలకు అమ్మవారికి మాంగల్యసూత్రధారణ జరిపించారు. ముత్యాల తలంబ్రాలను స్వామి, అమ్మవారి తలలపై పోయడంతో కల్యాణం ముగిసింది. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం సీతారాములను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో కూర్చోబెట్టి మేళతాళాల మధ్య మెయిన్‌బజారులో ఊరేగించారు.

టూమెన్ కమిటీ రద్దు చేయాలి

గార్లదిన్నె: శింగనమల నియోజకవర్గంలో టూమెన్ కమిటీ రద్దు చేయాలని, లేదంటే ఓటుతో తగిన బుద్ధి చెబుతామని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి పేర్కొన్నారు. శుక్రవారం గార్లదిన్నెలో నారాలోకేష్ చేపట్టిన యువగళం పాద యాత్ర గార్లదిన్నె మండలం డ్యాం రోడ్డు సర్కిల్ వద్దకు రాగానే ఎస్సీ సాకే హరి నారా లోకేష్‌ను కలిసేందుకు వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. తర్వాత టీడీపీ నాయకులు కలుగజేసుకొని సాకే హరిని నారా లోకేష్ వద్దకు పంపగా వినతిపత్రం అందించారు.

ఫయాజ్ ట్రస్టు ద్వారా విస్తృత సేవలు

తాడిపత్రి అర్బన్: ఫయాజ్ బాషా ట్రస్టు ద్వారా సేవలు మరింత విస్తృతం చేస్తామని వైఎస్సార్‌సీపీ నేత, ఫయాజ్‌బాషా ట్రస్ట్ చైర్మన్ హీరాపురం ఫయాజ్‌బాషా పేర్కొన్నారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని శుక్రవారం పట్టణ, రూరల్‌లోని మసీదుల్లోని 26 ఇమామ్, 26 మౌజన్లకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఇమామ్‌కు రూ.6,500, మౌజన్‌కు రూ.3,500 చొప్పున నగదుతోపాటు స్వీట్ బాక్స్ పంపిణీ చేశారు. దీంతోపాటు రంజాన్ ఉపావాస దీక్ష సమయంలో తరాబీ చదివించే ఇమామ్‌లకు ఒక్కొక్కరికి రూ.4ల వేల చొప్పున 12 మందికి రూ.48వేలు అందజేశారు. ఈ సందర్భంగా తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఫయాజ్‌బాషా మాట్లాడుతూ ఏటా రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ట్రస్టు ద్వారా ముస్లింలకు ఆర్థిక సాయంతో పాటు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్నామన్నారు. చుక్కలూరు రోడ్డు సమీపంలో 4.50 ఎకరాల స్థలాన్ని ట్రస్టు ద్వారా కొనుగోలు చేసి రంజాన్ అనంతరం ఒక్కో కుటుంబానికి 1.25 సెంట్ల స్థలాన్ని ఉచితంగా పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. కౌన్సిలర్లు రంగనాథ్‌రెడ్డి, రియాజ్, ప్రసాద్, బషీర్, వలి, వక్ఫ్‌బోర్డు చైర్మన్ షాషావలి, ఉపాధ్యక్షుడు మహబూబ్‌బాషా, హాజీవలి దర్గా కమిటీ గౌరవాధ్యక్షుడు అస్లాం, అధ్యక్షులు షామీర్ తదితరులు పాల్గొన్నారు.



రంజాన్ తోఫా అందిస్తున్న ఫయాజ్‌బాషా

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రై డే



తాడిపత్రిలో సిలువ యాత్ర నిర్వహిస్తున్న దృశ్యం



పామిడి సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు

గుంతకల్లుటౌన్: పట్టణంలోని క్రైస్తవులు గుడ్ ఫ్రైడేను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆర్‌సీఎం, సీఎస్ఐ, ఎస్‌పీజీ, బెయేర్షబా, తదితర చర్చిల్లో ఆయా చర్చిల పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు జరిపించారు. ఆర్‌సీఎం చర్చిలో జరిగిన ప్రార్థనల్లో పాస్టర్ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ క్రీస్తు జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని, ఆయన బోధనలను అందరూ పాటిస్తే ప్రపంచంలో శాంతి,సామరస్యాలు వర్ధిల్లుతాయన్నారు. ఆర్‌సీఎం చర్చిలో ఏసుక్రీస్తు శిలువ ఘట్టాన్ని ప్రదర్శించారు.

పెద్దవడుగూరు: మండలంలోని క్రైస్తవులు శుక్రవారం గుడ్ ఫ్రై డేను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా పెద్దవడుగూరు, చిన్నవడుగూరు, దిమ్మగుడి, రావులుడికి, క్రిష్టిపాడు, గుత్తిఅనంతపురం తదితర గ్రామాల్లోని చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించారు. పెద్దవడుగూరులో పాస్టర్ జాన్‌డేవిడ్, దిమ్మగుడిలో పోతురాయి శేఖర్ గుడ్ ఫ్రై డే విశిష్టతను తెలియజేశారు.

గుత్తి: పట్టణంలోని సీఎస్ఐ చర్చి, ఆర్ఎస్‌లోని సీఎస్ఐ చర్చితో పాటు పలు చర్చిల్లో శుక్రవారం క్రైస్తవులు గుడ్ ఫ్రై డే నిర్వహించారు. గుత్తి సీఎస్ఐ చర్చిలో జరిగిన వేడుకలకు బెంగళూరుకు చెందిన యూటీసీ ప్రిన్సిపాల్ కమ్ పాస్టర్ రెవరెండ్ డాక్టర్ చిలుకూరి వసంత రావు, చిలుకూరి కాంత దంపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు ఏసు సిలువపై ఉన్న ఏడు వ్యాఖ్యాలను వల్లించారు. ఉదయం 6 గంటల నుంచి చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

పుట్లూరు: మండలంలోని పుట్లూరు, కడవకల్లు, శనగలగూడూరు తదితర గ్రామాల్లో శుక్రవారం గుడ్ ఫ్రై డే నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్లు గుడ్ ఫ్రై డే విశిష్టతను వివరించారు.

తాడిపత్రి అర్బన్: క్రీస్తు సిలువ యాత్రతోనే మానవాళికి పాప విముక్తి కలిగిందని ప్రత్యేక సందేశకుడు డేవిడ్ అర్లప్ప అన్నారు. శుక్రవారం గుడ్ ఫ్రైడే సందర్భంగా పట్టణంలో సిలువ యాత్ర నిర్వహించారు. ఈ యాత్ర ఆర్సీఎం చర్చి స్కూల్ నుంచి ప్రారంభమై రాగితోటపాలెం, సుంకులమ్మ పాలెం వరకూ సాగింది. ఈసందర్భంగా డేవిడ్ అర్లప్ప మాట్లాడుతూ గుడ్ ఫ్రై డే ద్వారా ఏసు క్రీస్తు సిలువలో పలికిన ఏడు మాటల ద్వారా క్షమా, గుణం, బాధ్యత, ప్రేమ, పాపపు ఒప్పుకోలు, దయా గుణాలను అలవర్చుకోవాలన్నారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మదర్ థెరిస్సా ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. పట్టణంలోని పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు.

పామిడి: మండలంలోని అన్ని చర్చీల్లో శుక్రవారం గుడ్ ఫ్రైడే నిర్వహించారు. పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో సెక్రటరీ పరదేశి విజయశేఖర్‌రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరాధనలో వక్తలు క్రైస్తవులను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం చర్చి మాజీ సెక్రటరీ పరదేశి జయరాజు, పరదేశి కవిత జ్ఞాపకార్థం ఆయన కుటుంబసభ్యులు అన్నదానం చేపట్టారు.

యల్లనూరు: మండలవ్యాప్తంగా శుక్రవారం క్రైస్తవులు గుడ్ ఫ్రై డే జరుపుకున్నారు. యల్లనూరు, వెన్నపూసపల్లి, పెద్దమల్లేపల్లి, నిట్టూరు తదితర గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

అభివృద్ధి, సంక్షేమాన్ని వివరిస్తాం

గుత్తి: మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలతోపాటు అభివృద్ధిని ప్రజలకు వివరిస్తామని మున్సిపాలిటీ సచివాలయ కన్వీనర్ రంగస్వామి పేర్కొన్నారు. పట్టణంలోని 10, 11వ వార్డు సచివాలయాల్లో శుక్రవారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వార్డు వలంటీర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ సచివాలయ కన్వీనర్ రంగస్వామి మాట్లాడుతూ మా నమ్మకం నువ్వే జగన్ అనే కార్యక్రమాన్ని మున్సిపాలిటీ వ్యాప్తంగా నిర్వహిస్తామన్నారు. సీఎం వైఎస్ జగన్ ప్రవేశ పెట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించడంతో పాటు గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి ఉన్న తేడాను ప్రజలకు వివరిస్తామన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, వైస్ చైర్‌పర్సన్ బిందె వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి గురుప్రసాద్‌యాదవ్, కౌన్సిలర్ ఫరూక్, సులోచన, వాల్మీకి శివ, కృపా సుజాత, వార్డు ఇన్‌చార్జ్‌లు బింగి బాబు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

పామిడి: ప్రజా సమస్యల తక్షణ పరిష్కారమే ధ్యేయంగా సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో కలిసి సమన్వయంతో పనిచేయాలని వైఎస్సార్‌సీపీ మండల రూరల్ సచివాలయాల కన్వీనర్ ఎం కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం గజరాంపల్లి గ్రామ సచివాలయంలో నిర్వహించిన జగనన్న మీరే మా భవిష్యత్ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సచివాలయ కన్వీనర్ నాగేందర్‌రెడ్డి, తంబళ్ళపల్లి వెంకట్రామిరెడ్డి, హరినాథ్‌రెడ్డి, గృహసారథులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు సీతారాముల కల్యాణం

పామిడి: స్థానిక పెన్నానదిలోని సీతారామలక్ష్మణాంజనేయస్వామి ఆలయ ఆవరణలో శనివారం అరికెర బాలన్న కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. భక్తాదులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.